క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

చౌటుప్పల్ : మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల దరఖాస్తుదారుల్లో అనర్హులుగా గుర్తించిన వారిని పునఃపరిశీలన చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనర్హులుగా గుర్తించిన వారిలో కొంతమంది అర్హులు ఉన్నారని, అర్హులుగా గుర్తించిన వారిలో మరికొంత మంది అనర్హులు సైతం ఉన్నారని తెలిపారు. మరోసారి సర్వే చేసి, వారికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో దండ అరుణ్‌కుమార్, గంగదేవి సైదులు, మీసాల శ్రీను, మహేష్, యాదయ్య తదితరులు ఉన్నారు.

వక్ఫ్ భూములు పరిరక్షించాలి

ఆలేరురూరల్ : ఆలేరు మండలంలోని షారాజీపేట గ్రామంలో గల వక్ఫ్ భూములను పరిరక్షించాలని కోరుతూ బుధవారం ఎంపీటీసీ బత్తుల నరేందర్‌రెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నంబర్ 249, 251, 252లలో సుమారు 49 ఎకరాల వక్ఫ్ భూమి ఉందని, దీనిని కొంతమంది వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ భూములను కాపాడాలని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లామని తెలిపారు. భూములు ఆక్రమణకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

భువనగిరి : విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కల్లూరి మల్లేశం, కోమటిరెడ్డి చంద్రారెడ్డి కోరారు. ఈమేరకు బుధవారం విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయంలో డీఈకి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు వెంటనే పీఆర్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్టిజన్స్ కాంట్రాక్ట్ సర్వీసు మొత్తాన్ని కలుపుకొని సీనియార్టీ ఫిక్స్ చేయాలన్నారు. సబ్ స్టేషన్‌లో 4వ ఆపరేటర్‌ను నియమించాలన్నారు. అన్ని స్థాయిల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ పాషా, నాయకులు మాయ కృష్ణ, బోడ భాగ్య, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామన్నపేట : మండలంలోని నీర్నెముల గ్రామంలో ఇటీవల మృతిచెందిన గ్రామపంచాయతీ కార్మికుడు నోముల లింగయ్య కుటుంబానికి బుధవారం స్థానిక జాంబవ మహాసేన సభ్యులు రూ.11,600 ఆర్థికసాయం అందజేశారు. వారి వెంట సీఐ నోముల నర్సయ్య, నోముల యాదగిరి, పర్వతాలు, స్వామి, లింగయ్య, శ్రీరాములు, స్వామి, భీమలింగం, సుదర్శన్, అంజి ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ సీఐ

చౌటుప్పల్ : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ విజయ్‌కుమార్ అన్నారు. బుధవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలకు నంబర్ ప్లేట్లు లేని, అంకెలు తొలగించిన 72 వాహనాలను గుర్తించి కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఎస్సై జానయ్య, ఏఎస్ఐ ఇద్దయ్య, సిబ్బంది ఉన్నారు.

సీసీరోడ్డుకు అనుమతివ్వాలి

ఆలేరురూరల్ : దుర్గమ్మ గుడి ఎదుట, రైల్వే ట్రాక్ కింది నుంచి సీసీ రోడ్డు లేకపోవడంతో నెలకొంటున్న సమస్యలను మున్సిపల్ చైర్మన్ శంకరయ్య, కౌన్సిలర్లు బుధవారం రైల్వే అధికారులు ఏడీఈ పంజాల, సీపీడబ్ల్యూ భూపేంద్ర గుప్తాలకు వివరించారు. రైల్వే ట్రాక్ కింది నుంచి సీసీరోడ్డు నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరారు. వారిలో బేతిరాములు, అడెపు బాలస్వామి, చింతలపణి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్, నవీన్, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

రామన్నపేట : మండలంలోని 15మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం ఎంపీపీ కన్నెబోయిన జ్యోతీబలరాం పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మందడి ఉదయ్‌రెడ్డి, కార్యదర్శి పోచబోయిన మల్లేశం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి


బొమ్మలరామారం : రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని రేషన్ డీలర్ల సమాఖ్య మండల అధ్యక్షుడు సుర్వి వెంకటేష్‌గౌడ్ కోరారు. బొమ్మలరామారం మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సమాఖ్య నాయకులు రవి, రాజు, తాడెం ఆంజనేయులు, ప్రకాష్, దశరథ, శివ కుమార్, నాయక్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు సిద్ధం

- బీబీనగర్ మండలంలో 60 ఇళ్లకు 41 పూర్తి
- మిగతావి నిర్మాణ దశలో..
- 138 మంది అర్హులను ఎంపిక చేసి జాబితా రూపొందించిన అధికారులు
- త్వరలోనే పంపిణీ చేసే అవకాశం



చత్రఖానిగూడెంలో పంపిణీకి సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లు



బీబీనగర్‌లో పెయింటింగ్ వేయాల్సి ఉన్న ఇళ్ల సముదాయం

బీబీనగర్ : మండల కేంద్రంలో, చత్రఖానిగూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. కలెక్టర్‌కు జాబితాను అందజేసిన అనంతరం అక్కడి నుంచి వచ్చే ఆదేశాల మేరకు త్వరలోనే పంపిణీ చేయనున్నట్టు తెలుస్తోంది.

ఆరేళ్లుగా సాగిన నిర్మాణ పనులు

బీబీనగర్‌లోని లిప్రైసీ కాలనీ వద్ద 30 గృహాలు, కొండమడుగు పరిధిలోని చత్రఖానిగూడెం వద్ద 30 గృహాల నిర్మాణాలకు అధికారులు 2017 ఏప్రిల్‌లో శంకుస్థాపన చేశారు. అయితే రెండు చోట్ల నిర్మాణ పనులు ఆది నుంచి నత్తనడకను కొనసాగాయి. దీంతో 6 ఏళ్లు కావొచ్చినా 60 ఇళ్లకు గాను కేవలం 41 ఇళ్ల మాత్రమే పూర్తి చేశారు. బీబీనగర్‌లో 19 ఇళ్ల నిర్మాణాలను పిల్లర్ల దశలో వదిలివేశారు. ఫలితంగా పూర్తిగా దెబ్బతిని చువ్వలు తుప్పు పట్టిపోయాయి. అయితే నిర్మాణాలకు సంబంధించి బిల్లులు సకాలంలో మంజూరు కాకపోవడంతో మిగిలిన ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడంలేదు. దీంతో పూర్తి అయిన 41ఇళ్లను మాత్రమే పంపిణీ చేసేందుకు అధికారులు అర్హులను గుర్తించి జాబితాలు సిద్ధం చేశారు.

41 ఇళ్లకు 138 మంది అర్హుల ఎంపిక

రెండు చోట్ల నిర్మించిన 41 డబుల్ బెడ్‌రూం ఇళ్లకు గాను అర్హులైన 138 మందిని అధికారులు సర్వే ద్వారా ఎంపిక చేసి జాబితాను సిద్ధం చేశారు, కాగా బీబీనగర్, కొండమడుగులో లబ్ధిదారుల ఎంపికపై నిర్వహించిన గ్రామ సభల్లో ఎద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. 11వేల మంది జనాభా ఉన్న మండల కేంద్రంలో 11 ఇళ్లను పంపిణీ చేయనుండడం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. అర్హులైన వారిని కాకుండా పాలకవర్గం చెప్పినట్లుగా అధికారులు స్థానికేతరుల పేర్లను ఎంపిక చేశారని కొండమడుగు గ్రామంలో రసాభాస జరగడంతో గ్రామ సభను రద్దు చేశారు.

కలెక్టర్‌కు నివేదిక అందజేస్తాం



బీబీనగర్, కొండమడుగులోని డబుల్ బెడ్ రూం ఇళ్ల అర్హుల ఎంపిక పట్ల ప్రజా ప్రతినిధుల జోక్యం లేకుండా పారదర్శకంగా సర్వే చేపట్టాం. గుర్తించిన పేర్లలో అభ్యంతరాలు ఉంటే గ్రామ సభల్లో తెలిపేందుకు ప్రజలకు అవకాశం కల్పించాం. ఈ నెల 7లోపు కలెక్టర్‌కు అర్హుల జాబితాను అందజేయనున్నాం. కొండమడుగులోని అర్హుల జాబితాపై మరోసారి గ్రామసభ నిర్వహిస్తాం.

– అశోక్‌రెడ్డి, తహసీల్దార్, బీబీనగర్

లూయిస్ బ్రెయిలీకి నివాళి



నివాళులర్పిస్తున్న వికలాంగులు

భువనగిరి : లూయిస్ బ్రెయిలీ స్ఫూర్తితో వికలాంగులు ముందుకు సాగాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు సురుపంగ ప్రకాష్ అన్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక వినాయక చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 40 శాతం వైకల్యం ఉన్న ప్రతి వికలాంగునికి సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పించాలన్నారు. అంధులకు 100 శాతం సర్టిఫికెట్స్ ఉంటేనే బస్ పాస్, రైల్వే పాస్‌తో పాటు సంక్షేమ పథకాల్లో అవకాశం కల్పిస్తున్నారని, దీనిని తగ్గించాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు కాటపల్లి రజిత, కోశాధికారి బోల్లేపల్లి స్వామి, మహిళా కన్వీనర్ కొత్త లలిత, నాయకులు పద్మ, జహంగీర్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెపహాడ్ క్లస్టర్‌కు ఏఈఓ నియామకం

సాక్షి ఎఫెక్ట్

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండలంలోని పల్లెపహాడ్ గ్రామ రైతు క్లస్టర్‌కు జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏఈఓను నియమించారు. క్లస్టర్‌కు ఆరు నెలలుగా ఏఈఓ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతుండడంతో 'ఏఈఓ పోస్టు ఖాళీ' శీర్షికన ఈ నెల 2న 'సాక్షి' వార్తాకథనాన్ని ప్రచురించింది. దీంతో స్పందించిన వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు ఏఈఓ కీర్తనను నియమించారు. ఈమేరకు బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు.

నేడు మహిళా టీచర్లకు సన్మానం

మోత్కూరు : భువనగిరి పట్టణంలోని శ్రీసాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మహిళా టీచర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం మోత్కూరు మండల అధ్యక్షుడు బండారు మల్లయ్య బుధవారం తెలిపారు. భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, అడిషనల్ కలెక్టర్ దీపక్ తివారీ, డీఈఓ నారాయణరెడ్డి హాజరవుతారని తెలిపారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పరకాల మాజీ ఎమ్మెల్యే భిక్షపతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి

ఆలేరు : బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ ఆలేరు నియోజకవర్గ పాలక్, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరు భిక్షపతి అన్నారు. బుధవారం ఆలేరులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన బీజేపీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 7న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించనున్న వర్చువల్ సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కార్యకర్తలతో మాట్లాడనున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా బూత్ స్థాయి నుంచి శ్రమించాలని తెలిపారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. ఆలేరు నియోజకవర్గ కన్వీనర్ చిరిగె శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సూదగాని హరిశంకర్‌గౌడ్, పడాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు ఉట్కూరి అశోక్‌గౌడ్, ఎం సుభాష్‌రెడ్డి, బయ్యని చంద్రశేఖర్, పక్కీర్ రాజేందర్ రెడ్డి, పసరి తిరుమల రెడ్డి, బొట్టు అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బీజేపీదే అధికారం

- బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ పాలక్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు



అడ్డగూడూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

అడ్డగూడూరు : రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ పాలక్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల స్థాయి బూత్‌స్థాయి అధ్యక్షుల సమావేశాన్ని పార్టీ అధ్యక్షుడు కడియం సోమన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్‌రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా బీజేపీ బూత్ స్థాయి నాయకులు కృషి చేయాలని కోరారు. ఈ నెల 7న రాష్ట్ర స్థాయిలో జరిగే బూత్ స్థాయి సమావేశంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో తుంగతుర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ కడియం రామచంద్రయ్య, తుంగతుర్తి నియోజకవర్గ కన్వీనర్ రవి, జిల్లా కన్వీనర్ కురాకుల వెంకన్న, సాయిబాబా, మాజీ అధ్యక్షుడు మేకల ఇమ్మానుయేల్, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

మోత్కూరు : ఈ నెల 7న జరిగే బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నిర్వహించన్ను వర్చువల్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని ఆ పార్టీ తుంగతుర్తి నియోజకవర్గ కోఆర్డినేటర్ (పాలక్) ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కోరారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన బీజేపీ మోత్కూరు మున్సిపల్ శాఖ, మండల బూత్ కమిటీ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రైల్వే బోర్డు మెంబర్ కె.నాగార్జున్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బయ్యని చంద్రశేఖర్, బొట్టు అబ్బయ్య, దొంతి నర్సింహారెడ్డి, గౌరు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బయ్యని రాజు, కార్యదర్శి సజ్జనం మనోహర్, అంజయ్య, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి సోమయ్య, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

→ క్యాలెండర్ల ఆవిష్కరణ

రామన్నపేట : పీఆర్‌టీయూ(టీఎస్), తపస్, టీఎస్‌టీఎఫ్ ఉపాధ్యాయ సంఘాల నూతన క్యాలెండర్లు, డైరీలను బుధవారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య రామన్నపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, ఎంపీడీ గాదె జలేందర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీధర్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు సురేష్‌రెడ్డి, సత్యనారాయణరాజు, రవికుమార్, ఎస్‌ఏ రహీం, పెద్దబోయిన మణి, ముస్కు వెంకట్‌రెడ్డి, బొక్క సుధాకర్‌రెడ్డి, పెద్దిరెడ్డి శంకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి బొడ్డుపల్లి రాములు, కిరణ్ పాల్గొన్నారు.

→ బీర్ల అయిలయ్య ఆధ్వర్యంలో..

యాదగిరిగుట్ట రూరల్ : మండలంలోని రామాజీపేట గ్రామంలో టీపీసీసీ మెంబర్, ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బీర్ల అయిలయ్య రూపొందించిన క్యాలెండర్‌ను కాంగ్రెస్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు కుండే సిద్దులు, మొగిలిపాక శంకర్, నమిల కేశవులు, ఆరె జహంగీర్, శ్రీశైలం, నరేష్, గంగయ్య, కృష్ణస్వామి, విఘ్నేష్, కిష్టయ్య, శ్రీకాంత్ నరేష్, ఎల్లయ్య తదితరులున్నారు.

→ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

భువనగిరి : పట్టణంలో బుధవారం టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పులిపాటి మురళీ, సంఘం మండల ప్రధాన కార్యదర్శి సోమ సత్తిరెడ్డి, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి హిర్యా నాయక్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శశికుమార్, పోరెడ్డి రంగయ్య, దశరథరెడ్డి, భాస్కర్, వెంకటేశ్వర్లు, గోపాలకృష్ణ, వెంకటేశం, శ్రీదేవి తదితరులు ఉన్నారు.

→ టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

బీబీనగర్ : టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం 2023 క్యాలెండర్‌ను బుధవారం మండల కేంద్రంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, నోడల్ అధికారి యాదగిరి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు రాజారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, టీపీటీఎఫ్ అధ్యక్షుడు రంగయ్య, ప్రధాన కార్యదర్శి వీరభద్రం, సభ్యులు లింగయ్య, వీరబ్రహ్మం పాల్గొన్నారు.

→ టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలో బుధవారం టీఎస్‌యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మ, సర్పంచ్ జన్నాయికోడె నగేష్, ఎంపీటీసీ కవిత, ఉపసర్పంచ్ నవ్య, మండల శాఖ అధ్యక్షుడు వెంకన్న, ప్రధాన కార్యదర్శి కరుణాకర్ ఉన్నారు.

→ పీఆర్టీయూ ఆధ్వర్యంలో..

వలిగొండ : పీఆర్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం వలిగొండ మండల కేంద్రంలో ఎంపీపీ నూతి రమేష్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాకిటి పద్మాఅనంతరెడ్డి, ఎంఈఓ శ్రీధర్, ప్రధానోపాధ్యాయులు ఆనంద్‌ప్రసాద్, మహమ్మద్ అలీ, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పసల విజయానంద్, ఉపాధ్యాయులు బైరు చంద్రశేఖర్, విజయ్‌కుమార్, యాదయ్య, హనీఫ్, సాములా నాయక్, మాలతి తదితరులు పాల్గొన్నారు.

→ బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా భిక్షంగౌడ్

చౌటుప్పల్ : బీజేపీ మునుగోడు నియోజకవర్గ కన్వీనర్‌గా చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు దూడల భిక్షంగౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

→ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్

గుండాల : ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుండాల మండలంలోని బ్రాహ్మణపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగటి వెంకటేష్ ఎంపికయ్యారు. తన ఎన్నికకు సహకరించిన జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారు రవివర్ధన్, జిల్లా అధ్యక్షుడు తొంట సత్యనారాయణ, వస్కుల రమేష్, కనకయ్య, పానుగంటి యాదగిరి, దార శ్రీనివాస్, వెంకటయ్య, మల్లేష్, పరశురాములుకు బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

→ చెరువులో ఆంజనేయస్వామి విగ్రహాన్ని వదిలివెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు

భువనగిరి : భువనగిరి పెద్ద చెరువులో మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయస్వామి విగ్రహాన్ని వదిలివెళ్లారు. గమనించిన స్థానికులు బుధవారం విగ్రహాన్ని బయటకు తీసి పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిలో హిందూవాహిని పట్టణ శాఖ అధ్యక్షుడు కడావి శివకుమార్, వీహెచ్‌పీ నాయకులు చామ రవీందర్, బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ మేకల భాను, బీజేపీ కౌన్సిలర్ రత్నపురం బలరాం ఉన్నారు.

పోటీ పరీక్షల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలి

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రామన్నపేట : ప్రదర్శన తిలకిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



రాజాపేట : టీఎల్ఎం మేళాను పరిశీలిస్తున్న ఎంపీపీ గోపగాని బాలమణి తదితరులు

రామన్నపేట : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు పోటీపరీక్షల్లో రాణించే విధంగా తీర్చిదిద్దాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. తొలిమెట్టులో భాగంగా బుధవారం రామన్నపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బోధనాభ్యాసన సామగ్రి (టీఎల్ఎం) మేళాలో ప్రదర్శనలను తిలకించి మాట్లాడారు. అనంతరం సావిత్రీబాయి పూలే జయంతిని పురస్కరించుకొని మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, ఎంపీపీ కన్నెబోయిన జ్యోతిబలరాం, పీఏసీఎస్ చైర్మన్ నంద్యాల భిక్షంరెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ కమ్మంపాటి శ్రీనివాస్, ఎంపీడీఓ గాదె జలేందర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీధర్, నోడల్‌అధికారి సత్యనారాయణరాజు, సర్పంచ్‌లు, టీఆర్‌ఎస్‌పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు మందడి ఉదయ్‌రెడ్డి, పోచబోయిన మల్లేశం, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను వెలికితీయాలి

వలిగొండ : విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను వెలికితీయడానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంపీపీ నూతి రమేష్‌రాజు అన్నారు. బుధవారం వలిగొండ మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన బోధనా సామగ్రి మేళా (టీఎంఎల్)ను ప్రారంభించి మాట్లాడారు. గుణాత్మకమైన విద్యతో విద్యార్థులు చైతన్యవంతులు అవుతారని, ఉపాధ్యాయులు విద్యార్థులకు సులభతరమైన బోధన అందించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాకిటి పద్మఅనంతరెడ్డి, వైస్ ఎంపీపీ బాతరాజు ఉమాబాల్‌నర్సింహ, ఎంపీడీఓ గీతారెడ్డి, సర్పంచ్ బొల్ల లలితా శ్రీనివాస్, ఎంపీటీసీ కందారపు యశోధ కొమురయ్య, నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, ఎంఈఓ శ్రీధర్, మైసోళ్ల మచ్చగిరి, కంకల కిష్టయ్య, పాలకూర వెంకటేశం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎం మేళా

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో బుధవారం మండల స్థాయి ఎఫ్ఎల్ఎన్, టీఎల్ఎం మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ తండ మంగమ్మశ్రీశైలం, సర్పంచ్ జన్నాయికోడె నగేష్, ఎంపీటీసీ యాస కవితాఇంద్రారెడ్డి, ఉపసర్పంచ్ నవ్య, ఎంఈఓ శ్రీధర్, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి అరవిందరాయుడు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డి, ఆర్‌ఐ చిప్పలపెల్లి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రాజాపేటలో..

రాజాపేట : విద్యార్థుల అంతర్గత సామర్థ్యాలను వెలికితీసేందుకు టీఎల్ఎం మేళాలు ఎంతో దోహదపడతాయని ఎంపీపీ గోపగాని బాలమణి, ఎంపీఓ కృష్ణ అన్నారు. బుధవారం రాజాపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎల్ఎన్ టీఎల్ఎం మేళాను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాచపల్లి రాజు, మండల నోడల్ ఆఫీసర్ గాయం బాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బూర్గు మహేందర్ రెడ్డి, మల్లెమాలపాల్గొన్నారు.

మండల స్థాయి టీఎల్ఎం మేళా

బీబీనగర్ : మండలంలోని బాగ్‌దయార గ్రామంలో గల వీఎల్ఎన్ గార్డెన్‌లో బుధవారం మండల స్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు విద్యాబోధన సామగ్రి పరికరాలను ప్రదర్శనగా ఉంచి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను పెంపొందించాలి

తుర్కపల్లి : విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందించాలని ఎంపీపీ భూక్య సుశీలరవీందర్‌నాయక్ అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి టీఎస్ఎం (టీచింగ్, లెర్నింగ్, మెటీరియల్) మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని 44 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి దాదాపు 1200 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. బోధనోపకరణ పద్ధతుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పడాల వనిత, ఎంపీటీసీ సభ్యురాలు బోరెడ్డి వనజ, ఎంఈఓ కృష్ణ, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

6న ఇంటర్వ్యూలు

భువనగిరి : జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు శుక్రవారం జాబ్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సాహితి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ యాదగిరి టోల్‌వే ప్రైవేట్ లిమిటెడ్, గూడూరులో 10 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 25 సంవత్సరాల వయస్సు గల నిరుద్యోగ యువతీ, యువకులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

రామన్నపేట : మండలంలోని కక్కిరేణి గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం నార్కట్‌పల్లిలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారిలో నల్ల యాదయ్య, సోమనబోయిన సింహాద్రి, నల్ల సత్యనారాయణ, బోడ వెంకటనర్సు, సత్యనారాయణ, నల్ల రాములు, నడిగోటి మారయ్య, క్రిష్టయ్య, సురేష్, శంకరయ్య ఉన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కన్నెబోయిన జ్యోతి, సర్పంచ్ పిట్ట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలో వాటర్ ఫిల్టర్ ఏర్పాటు

భువనగిరి : మండలంలోని తుక్కాపురం గ్రామ పరిధిలో గల జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో దివీస్ ఫార్మాస్యూటికల్స్ కంపెనీ ఆధ్వర్యంలో బుధవారం సుమారు రూ. 3 లక్షల విలువ చేసే వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నోముల పద్మ, వార్డు సభ్యులు జనగాం మహేష్, క్రాంతిగౌడ్, గ్రామ కార్యదర్శి రాజు, ప్రధానోపాధ్యాయులు వెంకటేశం, స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడిగా సుధాకర్‌రావు

మోటకొండూర్ : మోటకొండూర్ మండల పాస్టర్స్ ఫెలోషిప్ మండల కమిటీని బుధవారం చందేపల్లి గ్రామంలోని అపోస్తలిక్ చర్చి వద్ద ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా సుధాకర్‌రావు చిలుక, ఉపాధ్యక్షుడిగా దేవదాసు, ప్రధాన కార్యదర్శిగా డానియేల్, సహాయ కార్యదర్శిగా దేవదాసు, కోశాధికారిగా ఫాల్, కార్యనిర్వాహకులుగా మధు, అబ్రహం ఎన్నికయ్యారు.

రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు అవకాశమివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న బీఎన్ తిమ్మాపురం గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు

భువనగిరి : బస్వాపూర్ రిజర్వాయర్‌లో బీఎన్ తిమ్మాపురం గ్రామ ముదిరాజ్‌లకు చేపలు పట్టుకునేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ బుధవారం గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆర్డీఓ ఎంవీ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బస్వాపూర్ రిజర్వాయర్‌లో బీఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన 1750 ఎకరాల భూమితో పాటు గ్రామం మొత్తం ముంపు కింద పోతుందన్నారు. బస్వాపురం గ్రామానికి కొంత మాత్రమే భూములు కోల్పోవడం జరిగిందన్నారు. రిజర్వాయర్ కింద ఎక్కువగా నష్టపోతున్న బీఎన్ తిమ్మాపురం గ్రామ ముదిరాజ్‌లకు చేపలు పట్టుకునేలా అవకాశం కల్పించాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం జిన్నా కృష్ణ, మాజీ ఎంపీటీసీ మల్లేష్, వల్దాస్ రాజ్ కాలభైరవ, పిన్నం గణేష్, జిన్నా బాలయ్య, శంకరయ్య తదితరులు ఉన్నారు.

పెయింటింగ్ అసోసియేషన్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న గొంగిడి మహేందర్‌రెడ్డి, సంఘం సభ్యులు

ఆలేరురూరల్ : మండల కేంద్రంలోని వైఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 8న నిర్వహించనున్న పెయింటింగ్ అసోసియేషన్ జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పంగ కిషన్, జిల్లా అధ్యక్షుడు కందుల నర్సింగరావులు కోరారు. ఈమేరకు బుధవారం ఆలేరు మండల కేంద్రంలో రహదారి బంగ్లా వద్ద ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో జిల్లా పెయింటింగ్ అసోషియేషన్ ఆధ్వర్యంలో సభ వాల్‌పోస్టర్‌ను డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డమీది రవీందర్, కర్రె వెంకటయ్య, ఆలేరు పట్టణ అధ్యక్షుడు పుల్లూరి రవి, మండల ప్రధాన కార్యదర్శి పంగ దశరథ, బాలరాజు, నాగరాజు, కందుల రామచందర్, యాదగిరి, గ్యాదపాక మల్లేశం, సీస సతీష్, నర్ర రమేష్, మల్లేష్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

జిట్ట రామచంద్రారెడ్డికి నివాళి

రాజాపేట : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ నాయకుడు జిట్ట రామచంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం రాజాపేట మండలంలోని బేగంపేట గ్రామంలో ఆయన స్థూపం వద్ద ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, మల్లారెడ్డి, హరినాథ్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, సాయిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి చిగుళ్ల లింగం, నాయకులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

బొమ్మలరామారం : మండల కేంద్రంలో అంబులెన్స్ నిర్వహణకు రామలింగంపల్లి ఎంపీటీసీ సభ్యుడు హేమంత్‌రెడ్డి రూ.10 వేల విరాళాన్ని బుధవారం ఎంపీడీఓ సరితకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిమ్ముల సుధీర్ రెడ్డి, వైస్ ఎంపీపీ శోభ, ఎంపీటీసీ శ్రీహరి, యంజాల సత్యనారాయణ, జ్ఞానప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాల దరఖాస్తు గడువు పెంచాలి

భువనగిరిటౌన్ : మైనార్టీ కార్పొరేషన్ లోన్ గడువు పెంచాలని కోరుతూ వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అతహర్ బుధవారం అదనపు కలెక్టర్ ఎంవీ భూపాల్‌రెడ్డికు వినతిపత్రం అందజేశారు. వివిధ ధ్రువీకరణ పత్రాలు అందక మైనార్టీలు లోన్‌కు దరఖాస్తు చేసుకోలేదని, ఈ నెల 5 వరకు ఉన్న గడువును మరో 15 రోజులు పొడిగించాలని కోరారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

గుండాల : మండలంలోని పాచిల్ల గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కర్నె వీరేషం ఆర్థిక సహకారంతో సమకూర్చిన టై, బెల్టులను బుధవారం సర్పంచ్ పందుల రేఖ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్పీ లింగయ్య, ఉపాధ్యాయులు ఉషాకిరణ్ పాల్గొన్నారు.